# మోసం చంద్రబాబు నైజం

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి



కొత్తపేటలో చంద్రబాబు మోసాలను ఎండగడుతున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

**విజయనగరం:** అధికారమనే అందలం కోసం ప్రజలను మోసగించడమే తన నైజంగా సీఎం చంద్రబాబు మార్చుకున్నారని, ఎన్నికల హామీల అమల్లో ఆయన నిజ స్వరూపం మరోసారి బట్టబయలైందని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు, వైఎస్సార్ సీపీ విజయనగరం నియోజకవర్గ సమన్వయకర్త కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ కొత్తపేటలో శనివారం పర్యటించిన ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కూరాకుల వీధిలో జరిగిన సమావేశంలో కూటమి అసమర్థ పాలనను ఎండగట్టారు. ఆ తర్వాత ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సర్కారు గద్దెనెక్కి ఏడాది పాలనలో ప్రజలను జరిగిన అన్యాయం, మోసం, ప్రతిపక్ష నాయకులను రాజకీయ కక్షతో వేధిస్తున్న తీరును వివరించారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని అమలు చేసిన ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. కూటమిగా ఏర్పడితేతప్ప గెలవలేమని, చెప్పి టీడీపీ, జనసేన, బీజేపీలు 2024 ఎన్నికలకు జట్టు కట్టాయని, గెలుపే పరమావధిగా అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను ప్రలోభపెట్టారన్నారు. తీరా వారు గెలిచాక హామీల అమలు గాలి కొదిలేశారని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు ఒకట్రెండు పథకాలు అరకొరగా అమలు చేసి, మొత్తం పథకాలు అమలు చేసేసినట్టు పైకి ఫోజు కొడుతున్నారని ఇదంతా చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. మొదట అమలు చేసిన గ్యాస్ సిలిండర్ పథకంలో కూడా మోసమేనన్నారు. ఎన్నికల హామీలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, ఇప్పుడు ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తుండడం మోసం కాదా అని నిలదీశారు. అలాగే తల్లికి వందనం పథకం కింద కొంతమంది తల్లులకు రూ.13 వేలు, మరికొంతమందికి రూ.10 వేలు ఇచ్చారని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు, బీసీలకు 55 ఏళ్లకే పెన్షన్ ఎక్కడ ఇచ్చారని, ఎప్పుడిస్తారని ప్రశ్నించారు.



సభకు హాజరైన ప్రజలు

### డైవర్షన్ పాలిటిక్స్‌తో దృష్టి మళ్లింపు..

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరిగిందని, ఏ గ్రామం వెళ్లినా ప్రజలే చెబుతున్నారని, అక్కడి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, రోడ్లు, కాలువల నిర్మాణాలే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని ఏ విధంగా మళ్లించి చంద్రబాబు అండ్ కో మోసం చేస్తున్నారో వివరించేందుకే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలంతా వాస్తవం గ్రహిస్తున్నారని, రాబోయే రోజుల్లో వారే కూటమికి తగిన బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యక్రమాలకు హాజరైన వారికి పథకాలు ఇవ్వమని బెదిరిస్తున్నారని ఇలాంటి రాజకీయాలు గతంలో తానెన్నడూ చూడలేదన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ సీపీలో లేరని, ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పార్టీ తరఫున పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేశ్వరరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేటర్ ఇసరపు రేవతి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, యువజన విభాగం ఇన్‌చార్జ్ జి.ఈశ్వర్ కౌశిక్, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆకట్టుకున్న భక్తి కళారాధన



భజన కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

**నెల్లిమర్ల రూరల్:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శనివారం చేపట్టిన భక్తి కళారాధన భక్తులను ఆద్యంతం ఆకట్టుకుంది. మొయిద విజయరామపురానికి చెందిన శ్రీవేంకటేశ్వర భక్తి భజన కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రెండు గంటల పాటు నిర్విరామంగా చేసిన భజనలు వీక్షకులను అలరించాయి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అట్టాడ పైడిరాజు, సభ్యులు పైడిరాజు, ముకుంద, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మొయిదలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'



గదల సన్యాసి నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని మొయిద గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబులు పాల్గొని, కూటమి మోసాలను ప్రజలకు వివరించనున్నారన్నారు. మండలానికి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

### ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న తహసీల్దారు రమణ

**పూసపాటిరేగ:** మండల కేంద్రంలోని ఎరువుల షాపుల్లో తహసీల్దారు ఎన్వీ రమణ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత మన గ్రోమోర్‌కు వెళ్లిన ఆయన..రికార్డులు, వాటిలో పేర్కొన్న వివరాలకు సరిపడ ఎరువుల నిల్వలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. జిల్లాలో యూరియా కొరత ఉండడం వల్ల షాపుల యజమానులు ఎరువులను ఏమైనా బ్లాక్ చేస్తున్నారా అనే విషయం పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, వీఆర్వో డి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### గంజాయి నిర్మూలనే లక్ష్యం : డీఐజీ గోపీనాథ్ జెట్టీ

**గజపతినగరం రూరల్:** గంజాయి నిర్మూలకు ప్రణాళికలు రూపొందించామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గజపతినగరం సర్కిల్ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాలకు అలవాటు పడి న యువతను డీ అడిక్షన్ సెంటర్లకు తరలించి చికి త్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, గజపతినగరం సీఐ జీఏవీ రమణ, ఎస్సైలు కిరణ్‌కుమార్, మహేష్, జయంతి, సీతారాం పాల్గొన్నారు.

### న్యాయం చేయండి..

**చీపురుపల్లి:** పట్టణంలోని జి.అగ్రహారంనకు చెందిన కొంతమంది వ్యక్తులు తనతో పాటు తన భర్తపై దౌర్జన్యం చేసి, తాము నిర్వహిస్తున్న రెస్టారెంట్‌కు తాళాలు వేసి ఇష్టారాజ్యంగా ధూషించారని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన రేగాన శాంతిప్రియ కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను కోరింది. ఈ మేరకు శనివారం చీపురుపల్లి వచ్చిన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. తమపై జరిగిన దాడి విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని.. పెద్ద మనుషుల వద్ద రాజీ చేసుకోవాలని పోలీసులు సూచించారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చింది. కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.

### కార్మికుల నిరసన

**దత్తిరాజేరు:** మండలంలోని సరయ్యవలస క్వారీ వద్ద కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలతో పాటు ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలు అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులకు నచ్చజెప్పి నిరసన విరమింపజేశారు.

# నిషేధిత పాలిథిన్ సంచులు వాడొద్దు



నెల్లిమర్ల: కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**పూసపాటిరేగ:** నిషేధిత పాలిథిన్ సంచులు వాడవద్దని ఎంపీడీవో ఎం.రాధిక అన్నారు. మండల కేంద్రంలోని కిరాణా షాపుల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నిషేధిత పాలిథిన్ సంచులు వాడుతున్నదీ లేనిదీ పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఏ ఒక్కరూ నిషేధించిన పాలిథిన్ సంచులు గానీ ప్లాస్టిక్ వస్తువులను గానీ విక్రయించవద్దని, ప్రతిఒక్కరూ పాలిథిన్ నిషేధానికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వర రావు, సర్పంచ్ టి.సీతారాం, కార్యదర్శులు రాంబాబు, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** పాలిథిన్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని కోరారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపంచాయతీలో ఇన్‌చార్జ్ కమిషనర్ టి.జయరాం ఆధ్వర్యంలో పాలిథిన్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ర్యాలీలో ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం నిషేధించిన పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వస్తువుల వాడవద్దని సూచించారు. అనంతరం ప్రజలతో పాలిథిన్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు.

**విజయనగరం ఫోర్ట్:** స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద పాలిథిన్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ర్యాలీని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాసంస్థలు, కార్యాలయాల వద్ద పాలిథిన్ నిషేధం విధించి, పక్కాగా అమలు చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం గంటస్తంభం:** నిషేధిత పాలిథిన్ సంచులు వాడకూడదని జిల్లా అటవీ శాఖ అధికారి ఆర్.కొండలరావు సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని అటవీ శాఖ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కార్యాలయ ఆవరణలో మొలిచిన పిచ్చిమొక్కలను పీకిపారేశారు.

**విజయనగరం అర్బన్:** జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ)లో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాలిథిన్ నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యం అందించండి

**పూసపాటిరేగ:** మండలంలోని గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలు, వైద్య సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగికి సక్రమంగా సేవలందించాలని, ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలన్నారు.

# పేదరిక నిర్మూలనే ధ్యేయం





మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తి బబిత తదితరులు

**విజయనగరం లీగల్:** పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమావేశ మందిరంలో శనివారం జరిగిన న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె..ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని మహిళా సాధికారత సాధించాలని కోరారు. అనంతరం జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ వారి పేదరిక నిర్మూలన పథకంలో భాగంగా విజయనగరం జిల్లాలోని ఐదు స్వయం శక్తి సంఘాలకు కోటీ ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. జిల్లాలో పేదరికంలో ఉన్న మహిళలు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయగా వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వశక్తితో తన కుటుంబాలను పోషించుకునే స్థాయికి మహిళలంతా ఎదగాలని ఆకాంక్షించారు. సదస్సులో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల ఆక్రమణలపై ఉదాసీనత ఎందుకు?

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు



మాట్లాడుతున్న కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకటరాజేశ్వరరావు

**విజయనగరం:** కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ప్రధాన రోడ్లు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకటరాజేశ్వరరావు ప్రశ్నించారు. నగరాభివృద్ధిలో భాగంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నగరంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 21 అంశాలపై చర్చించిన సభ్యులు.. వాటన్నింటినీ ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో రోడ్ల ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఎందుకు ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. రింగ్ రోడ్డులోని చేపల మార్కెట్‌లో మన ప్రాంతానికి సంబంధం లేని వారు వచ్చి ఎకరా స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారన్నారు. వారిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. రైల్వేస్టేషన్ రోడ్డు, నెహ్రూ పార్కు రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారిపోయాయని, ప్రజల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో బాదంమిల్క్ విక్రయాలు చేసే తోపుడు బండ్లు 150కి పైగా ఉన్నాయని, వారంతా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కార్పొరేషన్‌కు పైసా చెల్లించకుండా విక్రయాలు చేసుకుంటున్నారని వారిపై దృష్టి సారించాలన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ ప్రక్రియలో రావాల్సిన ఆదాయం ఎందుకు తగ్గిపోతుందన్నారు. క్లాప్ వాహనాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోందన్నారు.

### నగరాభివృద్ధి పనుల ఆమోదం..

మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ రానున్న పైడితల్లి పండగను దృష్టిలో పెట్టుకుని నగరంలో అభివృద్ధి పనులకు ఆమోదించడం జరిగిందన్నారు. అందరి సహకారంతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయాలని కోరారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. నగరంలో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు సుంకరి నారాయణరావు, రేగాన రూపాదేవి, అల్లు చాణక్య, కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

# హరికథ పాఠ్యాంశానికి ప్రతిపాదనలు పంపండి



ప్రిన్సిపాల్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి

**విజయనగరం టౌన్:** దక్షిణ భారతదేశంలో గజపతులతో ప్రప్రథమంగా నెలకొల్పబడిన విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో హరికథ పాఠ్యాంశానికి ప్రతిపాదనలు పంపించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఇదే విషయమై ఆ కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి హరికథా పితామహుడు ఆదిభట్ల 1919 నుంచి 1936 వరకు కళాశాల ప్రథమ అధ్యక్షుడిగా పనిచేశారని, ఆయన పనిచేసిన కళాశాలలో హరికథ పాఠ్యాంశం లేకపోవడం చాలా బాధాకరమన్నారు. విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, కర్నూల్, గుంటూరులలో సంగీత కళాశాలలు ఉన్నాయని, అయితే ఎక్కడా హరికథ పాఠ్యాంశం లేక రాబోయే తరానికి హరికథ కనుమరుగైపోయే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి గోపాలకృష్ణ, కంది సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే క్షమాపణలు చెప్పాలి



రొంతు భాస్కరరెడ్డి

**విజయనగరం:** మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు ఆర్‌కే రోజాపై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఏపీ రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రొంతు భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. ఓ సీనియర్ సినీనటి, మహిళ, మాజీ మంత్రి అయిన రోజాపై ఆమెను అవమానిస్తూ మాట్లాడడం తగదన్నారు. ఆమె అతడు పరుష పదజాలంతో చేసిన మాటలను ఖండిస్తున్నామని, క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేస్తే ఊరుకునేది లేదన్నారు.

### దరఖాస్తులాహ్వానం

**విజయనగరం టౌన్:** సమాజానికి నిస్వార్థ సేవలందించే వారికి ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా–2025 ఇచ్చే జాతీయ స్థాయి పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సమాజ సేవకులు, వైద్యులు, కళాకారులు, సాహితీవేత్తలు, కర్షకులు, క్రీడాకారులు తదితరుల సేవలను గుర్తించి వారికి ఆగస్టు 17వ తేదీన అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9652347207ను సంప్రదించాలని కోరారు.

# అధికార పార్టీ అరాచకాలకు తలొగ్గితే సహించేది లేదు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

**జామి:** అధికార పార్టీ నేతలకు అధికారులు తలొగ్గితే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. గొడికొమ్ములో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పిల్లల భవానీకి చెందిన రేకుల షెడ్‌ను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎందుకు తొలగించారని సభ్యులు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరాచకాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. కొన్ని సంవత్సరాలుగా ఉన్న షెడ్‌ను ఉన్నట్టుండి ఒక్కసారిగా ఎందుకు తొలగించారు.. ఎవరి ఒత్తిళ్లతో తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, పలువురు సభ్యులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో జామి హైస్కూల్‌లో వన్ ప్లస్ తీసుకువస్తే.. కూటమి ప్రభుత్వం దాన్ని ఎత్తేసిందన్నారు. ఏఆర్ పేట సర్పంచ్ సీహెచ్ సూరిబాబు, తదితరులు మాట్లాడుతూ.. పొలాల్లోని మోటార్లు షార్ట్ సర్క్యూట్‌తో పాడవుతున్నా విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా జీతాలు ఎందుకు ఇవ్వలేదని ఉపాధి అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు, తహసీల్దార్ కృష్ణంరాజు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను నిలదీస్తున్న సభ్యులు

# మీరా.. నీతులు చెప్పేది..?

- జనసేన నాయకుల తీరును ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**చీపురుపల్లి:** ప్రభుత్వాన్ని మోసం చేసిన ప్రబుద్ధులు రోడ్డెక్కి నీతులు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు కొసిరెడ్డి రమణ, బలగ రమేష్, బూరాడ మహేష్, పతివాడ రాము, గవిడి సురేష్, పండు, తదితరులు ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల కల్లాలకు.. పేదల కాలనీలకు వెళ్లే రోడ్డును దౌర్జన్యంగా తవ్వేసిన జనసేన నాయకుడు విజినిగిరి శ్రీను, ఆయనకు వంత పాడుతున్న వంగపల్లిపేట రాజు నీతులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ప్రభుత్వానికి భూములు ఇవ్వకుండా పరిహారం పొందిన వీరు నేడు నీతి, అవినీతి కోసం మాట్లాడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. 1985లో మాంగనీస్ గనులకు ప్రభుత్వం భూములను లీజుకు ఇచ్చినప్పుడు కూడా రైతుల కల్లాలకు రోడ్డును మినహాయించినట్లు గుర్తు చేశారు. 2006లో మెట్టకాలనీలో 850 మంది పేదలకు ఇళ్ల ఇచ్చినప్పుడు ఇదే రోడ్డును ప్రభుత్వం గుర్తించిందని.. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఇదే రోడ్డును గ్రావెల్ రోడ్డుగా పటిష్టం చేయడం జరిగిందన్నారు. 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇదే రోడ్డును ఆనుకుని 18 ఎకరాల భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసి 693 మందికి పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్ల నిర్మించడం జరిగిందన్నారు. అదే సమయంలో రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో ఈ రోడ్డుతో పాటు కాలనీలో రోడ్లు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అంతటి చరిత్ర కలిగిన రోడ్డు తమదేనంటూ ఇప్పుడు జనసేన నాయకుడు తవ్వేయడం సరికాదని తెలిపారు. ఇంతకాలం ఎక్కడున్నారో తెలియని పెద్ద మనుషులు ఇప్పుడు ప్రభుత్వం ఉంది కదా అంటూ వచ్చి పేదలను కష్టాలకు గురిచేసేందుకు పన్నాగం పనుతున్నారన్నారు. పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇటువంటి నాయకులపై ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు దృష్టి సారించాలని కోరారు.